**Eenadu**

# ఇంజినీరింగ్ సర్వీసెస్ పరీక్షల్లో ప్రిలిమ్స్, మెయిన్స్

- 2017 నోటిఫికేషన్ నుంచి అమలు
- తక్కువ కాలంలో నియామకాలకు అవకాశం
- తెలుగు విద్యార్థులు దృష్టిపెట్టాలంటున్న నిపుణులు

ఈనాడు – హైదరాబాద్

యూపీఎస్సీ నిర్వహించే ఇంజినీరింగ్ సర్వీసెస్ పరీక్ష (ఈఎస్ఈ)ల్లోనూ ప్రిలిమ్స్, మెయిన్స్ విధానం అమల్లోకి వచ్చింది. త్వరలో జారీకానున్న ఈఎస్ఈ-2017 ప్రకటన (నోటిఫికేషన్) ద్వారా ఈ విధానాన్ని అమలుచేయబోతున్నారు. రైల్వే, కేంద్ర జలసంఘం, టెలికం, మిలిటరీ ఇంజినీరింగ్, సర్వే ఆఫ్ ఇండియా, ఇతర శాఖల్లో ఇంజినీరింగ్ ఉద్యోగాలకు ఏటా యూపీఎస్సీ ఈఎస్ఈ పరీక్ష నిర్వహిస్తోంది. ఏటా 500 నుంచి 700 పోస్టుల్ని భర్తీ చేస్తున్నారు. ఈ పరీక్షకు 2013లో 1.71 లక్షల మంది, 2014లో 2.11 లక్షలు, 2015లో 2.61 లక్షల మంది దరఖాస్తు చేశారు. వీరిలో 30-35% మంది మాత్రమే పరీక్ష రాస్తున్నారు.

**1300 మార్కులకు..:** ప్రస్తుతం 1000 మార్కులకు వేర్వేరుగా జరిగే 5 రకాల రాత పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన వారికి మౌఖిక పరీక్ష జరిపి ఎంపిక చేస్తున్నారు. ఇకపై ప్రిలిమ్స్‌ను ఆబ్జెక్టివ్ విధానంలో 500 మార్కులకు; మెయిన్స్‌ను 600 మార్కులకు కన్వెన్షన్ విధానంలో నిర్వహిస్తారు. 200 మార్కులకు మౌఖిక పరీక్ష ఉంటుంది.

### *1:10 లేక 1:15 నిష్పత్తిలో ప్రధాన పరీక్షకు ఎంపిక?*

ప్రిలిమ్స్ ద్వారా ఎంత మంది అభ్యర్థుల్ని మెయిన్స్‌కు ఎంపిక చేస్తారన్న దానిపై స్పష్టత వచ్చేందుకు మరికొంత సమయం పట్టనుంది. ప్రొఫెసర్ నటరాజన్ కమిటీ 1:10 నిష్పత్తిలో ప్రధాన పరీక్షకు ఎంపిక చేయాలని ప్రతిపాదించింది. ఈ సంఖ్య 1:15 నిష్పత్తికి పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఎక్కువ మంది అభ్యర్థులు ఈ పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేస్తున్నా, పరీక్ష రాసే వారి సంఖ్య తక్కువగానే ఉంటోంది. ఈ నేపథ్యంలో ప్రిలిమ్స్ విధానాన్ని ప్రవేశ పెడితే సీరియస్ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేస్తారని, తదుపరి చర్యలకు సులువుగా ఉంటుందని కేంద్ర వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు పరీక్ష ప్రకటన జారీ అయినప్పటి నుంచి ఉద్యోగం వచ్చే వరకు ప్రస్తుత విధానంలో దాదాపు 2 ఏళ్ల వరకు సమయం పడుతుంది. దీనివల్ల విద్యార్థులు ఐటీ, సాఫ్ట్‌వేర్ రంగాలపై దృష్టి సారిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రిలిమ్స్, మెయిన్స్ విధానం ప్రవేశపెట్టడం ద్వారా ఇతర చర్యలు వేగంగా పూర్తిచేసి, ఏడాదిలోగా ఉద్యోగ నియామకాల్ని పూర్తి చేయాలని కేంద్రం నిర్ణయించింది. ప్రిలిమ్స్ విధానాన్ని ప్రవేశపెట్టడంవల్ల తొలి పరీక్షల్ని సక్రమంగా రాయకుంటే మెయిన్స్ రాయలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇది అభ్యర్థులకు నష్టమే.

### *తెలుగు రాష్ట్రాల నుంచి స్పందన అంతంతమాత్రమే..*

అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లేక ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వంటి గ్రూపు-ఏ కేటగిరి కిందకు వచ్చే ఈ ఉద్యోగం ద్వారా ఏడాదికి రూ.8-9 లక్షల వరకు జీత భత్యాలతో పాటు తగిన ప్రయోజనాలు అందుతాయి. అయినా తెలుగు రాష్ట్రాల నుంచి ఈ పరీక్షకు స్పందన తక్కువగా ఉంటోంది. బిహార్, ఉత్తర్ ప్రదేశ్, ఝార్ఖండ్, హరియాణా తదితర రాష్ట్రాల్లో బీటెక్‌లోనే ఈ ఉద్యోగాల సాధనకు విద్యార్థులు ప్రత్యేకంగా సన్నద్ధమవుతున్నారు. ఐటీ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు, ఉన్నత విద్యపై దృష్టిపెట్టడంతో తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఈ ఉద్యోగాలపై దృష్టిపెట్టడంలేదని చెబుతున్నారు.

### తెలుగు రాష్ట్రాల నుంచి స్పందన పెరగాలి

ప్రాథమిక సమాచారం ప్రకారం తెలుగు రాష్ట్రాల నుంచి కేవలం 20 వేల మంది బీటెక్ విద్యార్థులు మాత్రమే ఇంజినీరింగ్ సర్వీసెస్‌కు దరఖాస్తు చేస్తున్నారు. వీరిలోనూ శ్రద్ధగా సన్నద్ధమయ్యే వారి సంఖ్య తక్కువగా ఉంటోంది. ఈ ఉద్యోగాలపై విశ్వవిద్యాలయాలు విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. తెలుగు రాష్ట్రాల విద్యార్థులు దృష్టిపెడితే ఎక్కువ సంఖ్యలో ఈ ఉద్యోగాల్ని దక్కించుకునే అవకాశాలున్నాయి.

– వైవీ గోపాలకృష్ణమూర్తి,
ఛైర్మన్, ఏస్ ఇంజినీరింగ్ అకాడమీ

### ఉద్యోగంలో నిలకడ ఉంటుంది

బిట్స్ పిలానీ (గోవా)లో ఎలక్ట్రికల్ విభాగంలో ఇంజినీరింగ్ విద్య పూర్తిచేశా. ఈఎస్ఈ- 2015 లో4వ ర్యాంక్ సాధించి.. రైల్వేలో ఎలక్ట్రికల్ ఇంజినీరుగా ఎంపికై శిక్షణలో ఉన్నా. ఐటీ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలతో పోలిస్తే ఈ ఉద్యోగంలో నిలకడ ఎక్కువ. ఒత్తిడికి దూరంగా ఇంజినీరింగ్ ఉద్యోగాల్లో రాణించే అవకాశం ఉంది. ప్రిలిమ్స్, మెయిన్స్ విధానం అమలుచేయడం ద్వారా అన్ని సబ్జెక్టులకు ఏకకాలంలో కాకుండా ఓ ప్రణాళిక ప్రకారం సన్నద్ధమయ్యేందుకు అవకాశం ఉంటుంది.

– కె.హేమంత్ నాగసాయి,
ఈఎస్ఈ 2015 4వ ర్యాంకర్, ఏలూరు